## క్లుప్తంగా

### పల్లపు ప్రాంతాలు జలమయం

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కురిసిన భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. పల్లపు ప్రాంతాల్లో రోడ్లు జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

### నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

అంబాజీపేట: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలు గురువారం నుంచి అంబాజీపేట మండలంలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. 9న మాచవరం-3, 10న మాచవరం-2, 14న మాచవరం-1, 15న కె.పెదపూడి, 16న ఇసుకపూడి, 17న ఇరుసుమండ, 20న గంగలకుర్రు, 21న గంగలకుర్రు అగ్రహారం, 22న చిరతపూడి, 23న వాకలగరువు గ్రామాల్లో ఏపీ సీఎం జగనే ఎందుకు కావాలంటే(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాలు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కె.ఏనుగుపల్లిలో..

పి.గన్నవరం: మండలంలోని కె.ఏనుగుపల్లిలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్'ను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొనాలని చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు.

### వైభవంగా నాగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో బుధవారం నాగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. స్థానిక కొత్త వీధి మెయిన్‌రోడ్డులో నెలకొల్పిన ఈ విగ్రహాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ పురోహితులు విగ్రహ ప్రతిష్ఠను జరిపారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

### కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ముమ్మిడివరం మండలం దొమ్మేటి వారిపాలేనికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు రెండు కిడ్నీలు పాడైపోయి, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఆయనకు తల్లి కిడ్నీ దానం చేస్తున్నారు. ఆపరేషన్‌కి రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో అంత ఆర్థిక స్తోమత లేని వారు స్థానిక కాశీ అన్నపూర్ణ సేవా సంస్థను సహాయాన్ని కోరారు. దీంతో సేవా సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.20 వేల ఆర్థిక సాయాన్ని శ్రీనివాస రాజుకి అందజేశారు.


### విప్లవ వీరులకు సంతాపం

ఆలమూరు: భూమి కోసం, భుక్తి కోసం చేపట్టిన పోరాటాల్లో అమరులైన విప్లవ వీరులకు మండలంలోని బడుగువానిలంకలో అఖిల భారత రైతు కూలీ సంఘం తమ సంతాపాన్ని తెలియజేసింది. పేదలకు న్యాయబద్ధంగా పంపిణీ చేయాల్సిన భూమిని సత్వరమే అప్పగించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు డిమాండ్ చేశారు. గ్రామంలో గత రెండు దశాబ్దాలుగా పేదలకు పట్టాలు మంజూరు చేయడం లేదని విమర్శించారు. ఈ భూపోరాటంలో అసువులు బాసిన దానం విజయ్, తూలూరి మరియమ్మలకు ఘన నివాళులర్పించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఎ.దుర్గాప్రసాద్, ఆర్.జాను, కె.సూర్యారావు, బడుగు వెంకట్రావు, కుంచె రాజు తదితరులు పాల్గొన్నారు.

### బంద్ విజయవంతం

సఖినేటిపల్లి/మలికిపురం/రాజోలు : ఆలమూరు: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రం ప్రైవేట్ పరం చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీని స్థాపించాలని, ఇతర డిమాండ్లతో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, ఆలమూరుల్లో విజయవంతమైంది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

### బీజేపీ మండల అధ్యక్షుడి మృతి



పులిమే రాజారావు (ఫైల్)

అంబాజీపేట: పసుపల్లి మాజీ సర్పంచ్, అంబాజీపేట మండల శాఖ బీజేపీ అధ్యక్షుడు పులిమే రాజారావు (49) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద మృతి చెందినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజారావు గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. రాజారావు మృతికి బీజేపీ నాయకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- లొల్లలో గడప గడపకూ మన ప్రభుత్వం



లొల్లలో మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

ఆత్రేయపురం: అర్హులందరికీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడం చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలం లొల్లలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గడప గడపకూ మన ప్రభుత్వంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తూము కాశీ విశ్వనాథం, తూము తాతాజీ, దాట్ల సూర్యనారాయణరాజు తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించారు. లబ్ధిదారుల గణాంకాలతో సహా వివరించి మళ్లీ సీఎం జగన్‌ని ఆశీర్వదించాలని కోరారు. సీఎం జగన్ ప్రకటించిన నవరత్నాలు వార్షిక క్యాలెండర్ ప్రకారం లబ్ధిదారులకు ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేరుగా నగదు బదిలీని అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రజల బాగోగులు గాలికి వదిలేసి కాగితాల్లో అంకెల గారడి చేసే ప్రభుత్వం కాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా లబ్ధి చేకూరేలా సీఎం ప్రయత్నిస్తున్నారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారితో మాట్లాడుతూ అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో అక్కచెలెళ్లు అందరూ సీఎం జగన్‌కి అండగా నిలబడాలని కోరారు. కుల, మత, పార్టీ భేదాలు లేకుండా ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలన్ని సకాలంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా డైరెక్ట్‌గా తమ ఖాతాలకే జమ అవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వద్ద హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీడీఓ నాతిబుజ్జి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

# రైతు సేవలో ఆర్‌బీకేలు కీలకం



సోంపల్లిలో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రైతు సేవలో రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లు కీలకంగా మారాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం సోంపల్లిలో రూ.23 లక్షలతో నిర్మించిన నూతన ఆర్బీకేని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మండల కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా గ్రామంలోనే సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయానికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరు రాణి, నాయకులు బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవం



గీతామందిరం వద్ద స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సఖినేటిపల్లి: ఏపీ దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానం పర్యవేక్షణలో బుధవారం సఖినేటిపల్లి గీతామందిరం వద్ద ధర్మ ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద దేవస్థానం స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస్, రాజేష్‌లు లక్ష్మీనృసింహునికి అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. తొలుత గ్రామ పొలిమేర నుంచి మంగళవాయిద్యాలతో స్వామితో నగర సంకీర్తన చేస్తూ గీతామందిరం వరకూ శోభా యాత్ర చేశారు. శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. యాత్రలో దారిపొడవునా స్వామికి గ్రామస్తులు మంగళహారతులు పట్టారు. అనంతరం గీతామందిరం వద్ద స్వామికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం సూపరింటిండెంట్ పి.విజయసారథి, ఆలయ సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు.

### నేడు వీరవల్లిపాలెంలో పల్లెనిద్ర

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు బుధవారం స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొంటారన్నారు.

# విపత్కర పరిస్థితుల్లోనూ పథకాల అమలు



సఖినేటిపల్లిలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: రాష్ట్రం విపత్కర పరిస్థితుల్లో ఉన్న సమయంలోనూ పేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యథావిధిగా సంక్షేమ పథకాలు అమలు చేశారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం సఖినేటిపల్లిలో ఎమ్మెల్యే రాపాక, తనయుడు రాపాక వెంకట్ రామ్‌తో కలసి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, పేదల కుటుంబాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రాపాక దీవెనకుమారి, ఎంపీటీసీ నల్లి రత్నకుమార్, కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, నాయకులు రుద్రరాజు రంగరాజు, రాపాక సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు



కొత్తపేటలో ధాన్యం కొనుగోలుపై మాట్లాడుతున్న ఆర్డీవో ముక్కంటి

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని ఆర్డీవో ఎం.ముక్కంటి సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో ముక్కంటి ఖరీఫ్-2023 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ, సివిల్ సప్లైస్, వ్యవసాయ అధికారులు, వీఆర్‌ఓలు, వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ధాన్యం తరలించేందుకు వాహనాలు, జట్టు కూలీలు సమకూర్చడం వంటి అంశాలపై చర్చించారు. ఆర్డీవో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంచులు అందుబాటులో ఉంటాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలు సమకూర్చామన్నారు. ఆ ధాన్యాన్ని లోకల్ ఏరియాల్లో రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రైతులకు ఏ విధమైన సందేహాలు లేకుండా ఈ విషయాలన్నీ వారికి వివరించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఏవో పద్మలత, ఎంఎస్ఓ టీవీఎస్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వంట పాత్రల పంపిణీ



కొత్తపేటలో వంట పాత్రలు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు

కొత్తపేట: మండలంలో 82 ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం వంట పాత్రలు సరఫరా కాగా వాటిని పథకం నిర్వాహకులకు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో జరిగిన సభకు ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షత వహించగా అముడా చైర్మన్ దేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. దేవిడ్‌రాజు మాట్లాడుతూ సీఎం జగన్ ఆలోచనలు ఎంతో ఉన్నతమైనవన్నారు. సమాజంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు, వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాలనే లక్ష్యంతో దాదాపు ప్రతి పథకాన్ని వారి పేరునే అమలు చేస్తూ వారి బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేస్తున్నారన్నారు. నేడు పాఠశాలల్లో వంట చేస్తున్న మహిళలకు వంట పాత్రలు సరఫరా చేశారన్నారు. ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆకలితో అలమటించకూడదని, సంపూర్ణ ఆరోగ్యంతో చదువుకోవాలనే దృక్పథంతో పోషక విలువలతో కూడిన గోరుముద్ద పథకం అమలు చేశారన్నారు. ఎప్పుడో 20 ఏళ్ల నాడు ఇచ్చిన వంట పాత్రలతో పథకం నిర్వాహకులు ఇబ్బంది పడకూడదని ఎంతో ఖరీదైన వంట పాత్రలు సరఫరా చేశారన్నారు. గత ప్రభుత్వంలో మీకు రెగ్యులర్‌గా వేతనాలు వచ్చేవి కాదని, జగన్ ప్రభుత్వం వచ్చాక సక్రమంగా వస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌ని, ఇక్కడ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని ఆశీర్వదించి, గెలిపించాలని వారు కోరారు. సభలో సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, ఎంపీటీసీలు రేవాడి నాగమణి, పేపకాయల బ్రహ్మనందం, నేలపూడి భీమరాజు, గునిపే శ్యామల, దూళి సూరిబాబు, అవిడి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, స్థానిక జీబీహెచ్ పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుప్పలపూడి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# సభా మర్యాద పాటించాలి

కొత్తపేట: మండల పరిషత్ సమావేశంలో ప్రతిపక్ష సభ్యులుగా ఏదో ఉనికి చాటుకునేలా వ్యవహరించకుండా సభా సంప్రదాయాలు పాటిస్తూ సభ్యులుగా గౌరవం కాపాడుకోవాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు హితవు పలికారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మార్గన అధ్యక్షతన జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమీక్షించారు. తమకు మండల పరిషత్ నిధుల కేటాయింపు విషయంపై ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావిస్తూ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆందోళన చేశారు. దానిపై అధికారపక్ష సభ్యులు ప్రతిస్పందించారు. దీనిపై ఎంపీపీ గంగాధరరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పక్షపాతంతో పథకాలు అమలు చేశారని, అప్పటి పాలకులు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సభ్యులకు ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వకుండా, వారి ఎంపీటీసీ స్థానాలకు నిధులు కేటాయించకుండా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని స్పష్టం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. అంతే కాకుండా ఎమ్మెల్యేగా ఉన్న చిర్ల జగ్గిరెడ్డిని సైతం ప్రొటోకాల్‌కు విరుద్ధంగా తీవ్రంగా అవమానించారని గుర్తు చేశారు. సీఎం సంకల్పానికి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సూచనల మేరకు పరిపాలన సాగిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే దశల వారీగా మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. మీరు స్థానిక సంస్థల ప్రతినిధులుగా సీనియర్లని, మండల అభివృద్ధికి పార్టీ రహితంగా సహకరించాలే గాని ఉనికి చాటుకునే ప్రయత్నంలో రగడ సృష్టించడం, హేళనగా మాట్లాడటం తగదని హితవు పలికారు. హాస్టళ్లపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఒక సర్పంచ్ ప్రస్తావనపై ఎంపీపీ వివరించారు. వార్డెన్ హాస్టల్ వద్దే నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి తెలిపారు. ఎమ్మెల్యే కృషితో పీఆర్ శాఖ ద్వారా మండలంలో ఖండ్రిగ, పలివెల-పూజారిపాలెం, దేవరపల్లి-పూజారిపాలెం రోడ్లకు రూ.2.05 కోట్లు, చినగూళ్లపాలెం రోడ్డుకు జీజీఎంపీ, ఎమ్మెల్యే నిధులు రూ.30 లక్షలు మంజూరు కాగా త్వరలో పనులు ప్రారంభిస్తారని ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ రమాదేవి మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.57 లక్షలతో మండలంలో అన్ని గ్రామాల్లో 17 పనులు, 6 అంగన్‌వాడీ కేంద్రాలు ఆధునీకరించామన్నారు. మరో 50 లక్షలకు ప్రతిపాదనలు పంపామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి జెడ్పీటీసీకి రూ.కోటి కేటాయించేందుకు చైర్మన్ చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. వివిధ అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఏఓ కృష్ణారెడ్డి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికీ సొంత ఇల్లు లక్ష్యం



పుల్లేటికుర్రులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సొంత ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు ఉండాలనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పుల్లేటికుర్రు శివారు గొల్లగుంటలో తహసీల్దార్ టి.మంగతాయారు అధ్యక్షతన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అర్హులైన 65 మందికి మంజూరైన ఇళ్ల స్థలాల పొజిషన్‌ను లబ్ధిదారులకు చూపించామన్నారు. అర్హులై ఉండి ఇళ్ల స్థలాలు పొందని వారికి త్వరలో మంజూరు చేస్తామని ఎవ్వరూ అధైర్యపడొద్దన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను అభివృద్ధి చేసి ఇళ్లు నిర్మించుకునేలా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీలు కుసుమ వెంకటేష్, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, మట్టపర్తి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు నందుల ఆదినారాయణ, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, నీతిపూడి వెంకటరమణ, అందె మూర్తి, చిట్టూరి రాధాబాయ్, ముత్తాబత్తుల సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఎంతో ప్రతిభావంతులు



అంబాజీపేటలో దివ్యాంగుల రన్నింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: సమాజంలో ఉన్న దివ్యాంగులు విభిన్న రంగాల్లో ఎంతో తమ ప్రతిభను చాటుతూ ప్రతిభావంతులుగా రాణిస్తున్నారని, వారికి మరింత ప్రోత్సాహం అందించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమగ్ర సహిత విద్యావిభాగం-సమగ్ర శిక్ష, జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను సమగ్రశిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతి కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో సీఎం జగన్ మరెన్నో అవకాశాలు కల్పించి ఉన్నత స్థితికి చేర్చేందుకు పథకాలను సిద్ధం చేస్తున్నారన్నారు. పాఠశాల స్థాయిలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భవిత పాఠశాలల అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. వీరికి తగినంత మంది ఫిజియోథెరపిస్టులను ఏర్పాటు చేయాలని నిర్వాహకులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. జిల్లా డీఈఓ ఎం.కమలకుమారి మాట్లాడుతూ 6 నుంచి 8 ఏళ్లు, 9 నుంచి 11 ఏళ్లు, 12 నుంచి 14, 15 నుంచి 18 ఏళ్ల వయస్సు వారికి నాలుగు కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, కొర్లపాటి కోటబాబు, సూదాబత్తుల రాము, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, హెచ్ఎం కె.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్లంపై ఎక్కువ శ్రద్ధ చూపాలి



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

మామిడికుదురు: ప్రతి ఉపాధ్యాయుడు ఆంగ్లం బోధించే విధంగా తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని డీఈఓ ఎం.కమలకుమారి ఉద్బోధించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మూడు నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాలకు చెందిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు 52 మందితో నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడారు. కేవలం ఆంగ్ల టీచర్లే కాకుండా ప్రతి ఉపాధ్యాయుడు ఆంగ్లం బోధించే విధంగా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో విద్యారంగంలో సంస్కరణలు అమలు చేస్తున్నారని చెప్పారు. బైజూస్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు ట్యాబులు అందించిందన్నారు. వాటిని సక్రమంగా వినియోగించే విధంగా విద్యార్థులను చైతన్యవంతులను చేయాలన్నారు. తద్వారా వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు కార్యోన్ముఖులు కావాలని డీఈవో సూచించారు. సమావేశంలో కోఆర్డినేటర్లు ఎస్.లక్ష్మీనారాయణ, సీహెచ్ నిరంజని, ఆర్పీలు భావరాజు సూర్యప్రకాశరావు, కె.హనుమంతరావు, ఎంఈఓ-2 మోకా వెంకన్నబాబు పాల్గొన్నారు.

# అర్హులకు పథకాలు అందేలా చూడాలి

మలికిపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ సంపూర్ణంగా అందే విధంగా కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడి ముంగిటకు చేరాలన్నది సీఎం జగన్ ధ్యేయమన్నారు. గ్రామస్థాయిల్లో సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ఎంపీడీవో ఎం.వీరాస్వామి నాయుడు శాఖల వారీగా రివ్యూ చేశారు. శిథిల స్థితిలో ఉన్న శంకరగుప్తం, బట్టేలంక వంతెన, విశ్వేశ్వరాయపురం వంతెనలతో ప్రమాదం పొంచి ఉందని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. శంకరగుప్తం శిథిల వంతెన స్థానే కొత్త వంతెనకు రూ.5 కోట్లు మంజూరైనట్టు, విశ్వేశ్వరాయపురం వంతెన అభివృద్ధికి రూ.32 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్టు ఏఈ తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సమస్యలను సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, లక్కవరంలోని విద్యుత్ సమస్యలను సర్పంచ్ కోట పుష్పకుమారి సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆ శాఖ ఏఈ సతీష్ స్పందిస్తూ, సమస్యలు పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే భూ క్రయ విక్రయాలకు సంబంధించి గ్రామాలకు రావాల్సిన సెస్ రావడం లేదని కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు అన్నారు. అలాగే పలువురు సభ్యులు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ కందికట్ల నిర్మల, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, పీఆర్ డీఈఈ శ్రీరామకృష్ణ, సూపరింటెండెంట్ మిల్టన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



అంబాజీపేటలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సత్యమోహన్

అంబాజీపేట: అమలాపురం సుబ్బారాయుడు చెరువు వద్ద గురువారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కుడుపూడి సూర్యనారాయణ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. అంబాజీపేట సొసైటీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తన తాతయ్య అయిన సూర్యనారాయణ అమలాపురం పట్టణ ప్రథమ మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా సేవలందించారన్నారు. తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల గౌతమీ తీర శెట్టిబలిజ సంఘ కార్యదర్శిగా, బీసీల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. అమలాపురంలో శెట్టిబలిజ హాస్టల్‌ను నిర్మించి వేలాది మందికి విద్యను అందించి అందరి మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సూర్యనారాయణ విగ్రహావిష్కరణకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్యఅతిథిగా రానున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును దుశ్శాలువాతో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుత్తుల ధర్మ, పితాని అరుణ్‌కుమార్, కుంపట్ల సత్యవేణుగోపాలరావు, గుత్తుల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా 18 కలశాల పూజ



అప్పనపల్లిలో కలశ పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

మామిడికుదురు: అప్పనపల్లిలో అయ్యప్పస్వామి 18 కలశాల పూజ మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. గుడిమెట్ల ప్రదీప్, గుడిమెట్ల మణికంఠ స్వామి స్వగృహం వద్ద జరిగిన కలశాల పూజలో భారీ సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులతో స్వాములు నృత్యాలు చేస్తూ కలశాలతో వైనతేయ గోదావరి నది వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడి నుంచి కలశాలతో జలాలు తీసుకువచ్చి కలశ పూజ నిర్వహించారు. పెదపట్నానికి చెందిన జయంతి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. చిరవూరి సాయి నర్సింహమూర్తి వినాయకునికి, సుబ్రహ్మణ్యస్వామికి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సహస్రనామాలతో అర్చన చేశారు. మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన నిర్వహించారు.